ఆ వీధి చాలా గొప్పది. ఆ వీధిలో ఇళ్ళు చాలా గొప్పవి. ఆ వీధిలో కారులేని ఇల్లు లేదు. యిళ్ళలో టి.వి. జతగా లేని (ఫిడ్జి లేదు. ఇంటిముందర బొమ్మ కుక్కపిల్ల లాడుకోని లాన్ లేదు. లాన్ (పక్కన గూర్ఖా నుంచోని గేటు లేదు. అందాలరాసి ఆ వీధి!

# పొగ

దేవరకొండ గంగాధరరామారావు

ఆ వీధిలో భార్యలను మరపించి, మురిపించే వేశ్యల వెంటబడే భర్తలున్నారు. భర్తల చాటున (పియుల విందు అందుకునే భార్యలున్నారు. ఆ వీధి డబ్బుకీ, మత్తుకీ, మగువకీ, తెగువకీ పెట్టింది పేరు!

ఇంకా చెప్పాలంటే,


ఆ వీధిలో, సిమెంటు లేకుండా ఉత్త యిసుకతో యిళ్ళు, (బిడ్జీలు కట్టగల నేర్పున్న కం(టాక్టరు వీ(రాజున్నాడు.

సగం తనకిస్తే మింగేసి, కట్టవలసిన టాక్స్ అంతా రద్దుచేసే మంచి మనసున్న ఆఫీసరు ఆనందరావు వున్నాడు.

ఇటు దొరలచేతా, అటు దొంగల చేతా 'శెభాష్' అనిపించుకుని సెం(టలు జైలంత యిల్లు కట్టి అందులో డబ్బును ఖైదీగా వుంచిన రిటైర్డ్ పోలీస్ ఇన్‌స్పెక్టరు సుబ్బారావున్నాడు.

ఆ వీధిలో, పేకాట, (బాకెట్టు, ముండల కంపెనీకి 'జాలీ క్లబ్' అని పేరు పెట్టి జాలీగా బతికేస్తున్న జాలయ్య వున్నాడు. యింకా,

వేలిము(దతో ఇండిపెండెంటుగా ఎలక్షన్లు గెలిచేసి, గెలిచాక, మొగ్గేసి, పాలకవర్గం వైపు మొగ్గేసి మెంబరయిన వెల్లాళ్ళకే యిల్లు కట్టేసుకున్న ఎమ్.ఎల్.ఎ. సిద్ద య్యున్నాడు.




ఇంత సుఖంగా, సుందరంగా (బతికే ఆ వీధి చూసి దేముడి కళ్ళు కుట్టాయి. ఈ మేడల మధ్య ఓ పూరిపాక పెట్టాడు. గాలేస్తే ఎగిరిపోయే పాక. మంట కసిరినా, మంచు కురిసినా గజ గజలాడే పాక. ఆ పాకలో ఎవరో దిక్కులేని, తిండి లేని దౌర్భాగ్యులు పురుగుల్లా, పుల్లల్లా వుంటారు. మట్టిపొయ్యిల మీద తడిసిన ఆకులు మంట పెట్టి వాళ్ళు గంజి కాచుకుంటే, ఆ నల్లటి పొగ అంద మైన మేడల రంగు మాపేస్తుంది. ఆ పొగ యిళ్ళల్లో దూరి అందరి మెడలూ చుట్టుకుని పీకలు నొక్కినట్టుం టుంది. ఆ పాక ఆ మేడల పాపాలకి శాపంలా, ఆరిన ఆశల దీపంలా వుంటుంది. ఆ పాక చూస్తే మేడలకు అసహ్యం!

అందుకనే ఆ మేడల్లోని డైమండ్ నెక్లెస్‌లూ, కంచి పట్టుబూ, ఫారెన్ నైలెక్సులూ, వడ్డాణాలు, ముచ్చటగా కలుసుకుని పేకాడుకుంటూ, పార్టీలు చేసుకుంటూ ఆ పాక పీకించేయాలని తీర్మానాలు చేసుకుంటాయి.

ఇన్ని మేడల మధ్య ఇలాంటి అలగాజనం దూరి కాపురం పెడితే మనకి సేఫ్టీ ఏదీ? అని భయపడు తుంటారు. మన దేశంలో విలువలు దిగజారిపోతున్నా యని వాపోతుంటారు.

కాని ఆ పాకలోకి మధ్య మధ్య మంచివాళ్లొస్తుం టారు. వాళ్ళు మేడల వాళ్ల ఐశ్వర్యం చూసి ముచ్చట పడుతూ వినయంగా భయపడుతుంటారు. కాస్త వణ్ణం పెడితే దణ్ణం పెడుతూ రోజంతా పనిచేసిపెడతారు. పిలుస్తే పలుకుతారు. పెడితే తింటారు. తిడితే పడ తారు.

కానీ అందరికి ఆ వినయం, విధేయతా వుంటాయా? ఇటీవలే ఆ పాకలోకి ఓ కొత్త దంపతులు ఆరేళ్ళ కొడుకుతో సహా అద్దెకు దిగారు. అతనికి మిల్లులో పని. అతనికి ఆస్తి ఏమీ లేదు. ఆత్మగౌరవం, తుపాకి గుళ్ళకు లొంగని గుండెబలం, రక్తం చిందించి పని చేసే కండబలం మా(తం వున్నాయి. ఆమెకూ ఏమీ లేదు. ఆమెకు దేముడిచ్చిన ఆభరణాలు అందం, ఆరోగ్యం. నున్నని, మెరిసే ఒళ్ళు. జంకని, లొంగని, వంగని యౌవనం. మనిషిగా బతికే ధైర్యం. మేడల భోగాలకీ, కారుల వేగానికీ, మగాడి చూపులకీ బెదరిపోని కరకుదనం. చాకులాంటి చక్కదనం.

డబ్బుతో కొనలేని ఆమె అందం చూసి మేడల్లో ఆడవాళ్ళు అసూయతో కుమిలిపోయారు. మేడల ఫోన్లు గరగరలాడాయి. 'ఆ వెధవకి కూలి పనిట. వాడి పెళ్ళాం మనకి కాస్త పనులు చేస్తే బాగుండదూ?' అంది మొదటి ఫోను.

'అదే నేనూ అనుకున్నాను. దాని మెడలో పసుపు తాడు తప్ప ఏం లేదు. మనకి సహాయంగా వుంటే ఏదో యింత పడేయొచ్చు' అంది రెండో ఫోను.

రెం(డోజులు పోయాక మళ్ళీ అంది మొదటి ఫోను ''మా అప్పిని పంపి, మా దొరగారింట్లో సహాయం కావాలి వస్తావా?' అని అడిగించా. అదేమందో తెలుసా? 'ఈ వీధిలో దొరలెవరూ లేరే! అయినా మీ దొరగారి పెళ్ళాం నాకు సహాయం చేస్తే, నేనూ చేస్తానని చెప్పు' అందిట. చూశారా, ఎంత పొగరో?''

రెండో ఫోను ఉ(ద్రేకంతో ఊగిపోయి అంది


"అవును. నాకూ జరిగింది పరాభవం. మా అమ్మగారు ఓసారి నిన్ను కనిపించమన్నారని కబురు పెట్టాను. అది 'నాకు తీరిక లేదు. మీ అమ్మగారినే వచ్చి ఓసారి నాక్కనిపించమను' అందిట. ఏం చూసుకుని దీనికింత గర్వం!"

రెండు ఫోనులు నాలుక కొరుక్కున్నాయి. బుగ్గలు నొక్కుకున్నాయి. మొదటి ఫోను ఛీ! అంది. రెండో ఫోను ఛీ! ఛీ!! అంది. డబ్బు విలువ తెలియని వాళ్ళు ఎప్పుడో ఆ డబ్బు ఉసురు తగిలి నాశనమైపోతారు.

ఓ రోజు మోజుగా సిద్దయ్య, వీర్రాజు, ఆనందరావు, సుబ్బారావు వగయిరాలు మందు పార్టీ చేసుకుంటున్నారు. వీళ్ళతో పాటు గెస్టు ఆర్టిస్టుగా నాగరాజు కూడా వున్నాడు. నాగరాజు వీర్రాజు బావమరిదిగా చెలామణీ అవుతున్నాడు. కాని, కాదు. అసలు నాగరాజు, నాగరాజే కాదు. నాగరాజు పేర్లూ, ఊర్లూ మారుస్తూ పేరు మోసిన స్మగ్లర్‌గా ఎక్కడుంటే అక్కడ గౌరవంగా బతికేస్తుంటాడు. అందుకనే నాగరాజంటే అందరికీ యిష్టం!

నాగరాజు మందుకొట్టి ఊపులోకెళుతూ, అరువు బావ వీర్రాజుతో అన్నాడు.


'ఏంటి బావా? మీ వీధిలోకి మంచి పిట్టను కొట్టుకొచ్చావుట' అని. ఆ పిట్ట పాకలో వున్న అమ్మాయి అని అందరికీ తెలుసు.



వీర్రాజు 'పిట్ట' పేరు వినగానే గతుక్కుమన్నాడు, తన పరాభవం గుర్తు చేసుకుని.

"పిట్టా, గిట్టా అనకు పళ్ళు రాలతాయి" అన్నాడు వీర్రాజు భయంగా. నాగరాజు "ఏం జరిగిందేమిటి?" అనడిగాడు కుతూహలంగా. వీర్రాజు చెబుతుంటే మందుకొట్టిన శరీరాలు ముందుకు వంగి విన్నాయి. "అది- ఆ పాకలో గుంట. అది చాలా డేంజర్. దాని అందం చూస్తే కొరుక్కు తినాలనిపించింది. ముందుగా మంచి చేసుకుందామని మా డ్రైవరు చేత స్వీట్లు పంపాను సరదాగా తినమని. అది 'నాకు సరదా లేదు. యిదిగో యిది మీ అయ్యగారినే సరదాగా తినమను' అని యింత పచ్చగడ్డి పీకి మా డ్రైవరు చేతిలో పెట్టి కసిరిపారేసింది" అని తనకు జరిగిన పరాభవం చెప్పుకుని కుర్చీలో వాలిపోయాడు వీర్రాజు.

దానికి తమ ఆగ్రహం తెలుపుతూ అంతా పళ్ళు పటపటా కొరికారు. అప్పుడు సిద్దయ్య ఓ పెగ్గులాగి యిలా అన్నాడు. 'బాధ పడకు వీర్రాజు. నేనూ ఎక్‌పెరిమెంటు చేశాను. దవడ పేలిపోను. ఆ దేముడే రక్షించాడు' అన్నాడు దేముడు దుష్టరక్షకుడని నమ్ముకున్న సిద్దయ్య. అప్పటికి రెండో రౌండులోకొచ్చిన మిత్రులు గుడ్లు తేలేస్తూ 'ఏం జరిగిందేమిటి?' అని సిద్దయ్య మీదకు వాలారు. అప్పుడు సిద్దయ్య ఓ మిరప కాయ బజ్జీ కసిగా నమిలి, గొంతు తడుముకుని ప్రారం



విశాఖలో "సాతంత్రం చిగురేసింది" కథా సంపుటి ఆవిష్కరణ సభ. ప్రసంగిస్తున్నవారు శ్రీ గూటాల కృష్ణమూర్తి, శ్రీ కాళీపట్నం రామారావు, శ్రీ చంద్ర ప్రభృతులు ఉన్నారు

భించాడు.

ఓ రోజు మందుకొట్టి కారులో వత్తన్నా. ఆ లంజ ఎదురొచ్చింది. మంచి మజాగా వుంది సరుకు! అసలే మత్తులో వున్నానేమో, మనసు లాగేసింది. కారు దాని మీదక్పోనిశా ఏలాకోలంగా. 'అమ్మో' అని పక్కకు గెంతితే నవ్వుతూ పలకరించి పరాచికాలాడదామను కున్నాను. యిదేగా నా టెక్నిక్కూ! దాని సిగదరగా, ఓ సరసం లేదు చట్టుబండలూ లేదు. గునపం పాతేసినట్టు మంచుని, కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ నాకేసి చూసింది. బేజారైపోయి బ్రేక్ నొక్కాను. అది డోరు ప్రక్కకొచ్చి 'వెధవా! ఏం, కళ్ళు మూసుకుపోయాయా?' అని చెయ్యెత్తింది" అని తన కథ చెప్పి వీరరాజుని ఓదార్చాడు. ఇన్‌స్పెక్టరు సుబ్బారావు అంతా విని అగ్గైపోయాడు.

"సర్వీసులో వుంటే దీని సంగతి పోలీసు స్టేషనులో తేల్చేద్దును. ఏంటసలు దీని పొగరు? మనమేమైనా రాళ్ళెత్తమన్నామా? రప్పలెత్తమన్నామా? ఏదో సరసం తెలిసినోళ్ళం గనగ మనతో సరదాగా వుండమన్నాం. యిదేం మగా పతివ్రతా? అసలు మనందరం కలిసి దీన్ని రేప్ చేస్తే ఏమౌతుంది దీని బిగుతూ?' అంటూ ఊగిపోతూ బల్ల గుద్దాడు. నాగరాజు నవ్వాడు.

"అసలు దీని గొడవెందుకయ్యా మీకు. మీక్కావా లంటే దోరజామకాయల్లాంటి పిల్లల్ని రప్పిస్తాను బొంబాయి నుంచి" అన్నాడు.

వీరరాజు అన్నాడు "అది కాదు నాగరాజా, అసలు మన పిస్టేజీ దెబ్బతింది గదా! యిక యీ వీధిలో మనం తలెత్తుకు తిరిగేదెలా?" జాలయ్యందుకున్నాడు. "అదీ పాయింటు. అది మన పక్కలో కన్నా రావాల, లేదా ఆ పాకిక్కడ నుంచి లేపెయ్యాల!"

నాగరాజు వ్యాపార బుద్ధి చురుగ్గా పని చేసింది.

"నేను తలుచుకుంటే యీ రాత్రికి రాత్రే ఆ పాకిక్కడ లేకుండా చేయగలను' అని ఓ అగ్గిపుల్ల అంటించి, గాలిలో హారతిచ్చినట్టు తిప్పి, సిగరెట్టంటించి ఏం?" అన్నాడు. నాగరాజు భావం అందరికీ అర్థమైంది. నాగరాజు ఏమైనా చెయ్యగలడని అందరకీ తెలుసు. అయినా జాలయ్య భయంగా అన్నాడు.

"దాని మొగుడో పొగరుమోతు. ఆడెప్పుడూ ఆరంగుళాల కత్తి మొలలో పెట్టుకు తిరుగుతాడు."

నాగరాజు షర్టు పైకెత్తి, బెల్టుకి వేలాడుతున్న పిస్టలు చూపించి ధైర్యంగా నవ్వాడు. అంతా ఓ.కె. అన్నారు. నాగరాజు రేటు కుదుర్చుకున్నాడు. ఖాళీగ్లాసులు మీటించి అందరూ నాగరాజుకి 'జై' అన్నారు.

రాత్రి మూడయింది. అంతా గాఢ నిద్రలో వున్నారు. పాక నడికప్పుమీద మంటలు లేచాయి. మరో కాసేపటికి నల్లటి పొగ వీధంతా కమ్ముకుంది. నిద్రలో వున్నవాళ్ళు ఊపిరాడక బయట డాబాల మీద కొచ్చి చూశారు. పాక భగ్గున మండిపోతోంది. ఆ మంటల కాంతులు నెత్తురు చారల్లా మేడల మీద పడుతున్నాయి. పాక గుండెలు పగిలినట్లు వెదురుబొంగులు టప్, టప్‌మని పేలుతున్నాయి. ఎవరూ పాకదగ్గరకెళ్లలేదు. బెంబుడు నీళ్ళు పోయలేదు. అరగంటలో పాక కాలి మసైపోయింది. పాకలో యువకుడు, అతని భార్య, కొడుకు సామాన్ల మధ్య వీధిలో దిష్టిబొమ్మల్లా నుంచున్నారు. మేడల తలుపులు మూసుకున్నాయి. 'శని విరగడైందని' వళ్ళు విరుచుకుని, ఆవులించి, మళ్ళీ మేడలు నిద్రపోయాయి.

మర్నాడుదయం అక్కడ పాకలేదు. అందులో మను షులు లేరు. తరతరాలుగా వున్న పాక కాలిపోయింది. మేడలు నిలబడ్డాయి. చెపితే వినందే చెరిపి పారేశాయి. పాక చేసిన పాపం ఏమిటో, పాపం!

రాత్రికి రాత్రే ఊరెళ్ళిపోయిన నాగరాజు మళ్ళీ నాలుగు రోజులు పోయాక వచ్చాడు. అందరి గౌరవం నిలబెట్టిన నాగరాజుకి మందు పార్టీ యిచ్చి సన్మానం చేశారు. యథావిధిగా మందు కొట్టి వీరరాజు, నాగరాజు మెడలో దండ వేసి రెండు ముక్కలు చెప్పాడు.

"ఏదో మనం నాలుగు డబ్బులు చేసుకుని సుఖంగా వుంటే చూళ్ళేక యీ పాకలో వాళ్ళు కళ్ళల్లో నిప్పులు పోసుకున్నారు. ఆళ్ళ నిప్పులు ఆళ్ళనే కాల్చేశాయి. మా బామ్మర్ది నాగరాజులాంటి ధైర్నవంతులింకా వుండబట్టి మనం సేప్టీగా వుంటున్నాం."

జాలయ్య లేచి, 'పాకెగిరిపోయింది కాబట్టి అక్కడ పిల్లలాడుకోడానికి ఓ పార్కు, పెద్దోళ్ళు 'ఆడుకోడానికి' ఓ గెస్టు రూము కట్టిత్తానని వాగ్దానం చేశాడు.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు "ఎవరి హద్దుల్లో వాళ్ళుండాలి. మనదేశానికి క్రమ శిక్షణ అవసరం. హద్దులు, హోదాలు మీరి గొప్పలకు పోతే శిక్ష తప్పదు" అన్నాడు. నాగరాజు సమాధానంగా అన్నాడు 'ఏదో మనిషిగా నాకు తోచిన సహాయం చేశాను. ఆళ్ళు ముగ్గురూ తప్పించుకు పోయారు. ఈసారి ఏదైనా గొడవొస్తే నాకు కబురు చెయ్యండి' అని పిస్టలు గాలిలోకి ఎగరేసి పట్టుకున్నాడు. అందరూ ధైర్యంగా ఊపిరి పీల్చారు. కరతాళ ధ్వనుల మధ్య పార్టీ పూర్త యింది.

మర్నాడు ఆ వీధిలో కంట్రాక్టరు వీరరాజు యింటి ముందు జనం పోగయ్యారు. వీరరాజు యింటి గేటు ముందర నాగరాజు చచ్చిపడున్నాడు. నాగరాజు వీపులో ఆరంగుళాల కత్తి దిగి వుంది. ఈ దృశ్యం చూసి వీధంతా గజగజలాడింది. మేడల పునాదులు కదిలినట్ట యింది. లాకర్లలో బంగారం బావురుమంది. మనిషికి రక్షణ లేదు. అరాచకం ప్రబలింది. సనికిమాలినోళ్ళు పేట్రేగిపోతున్నారు.

వీరరాజు, సుబ్బారావు, జాలయ్య వగైరాలు అత్యవ సర సమావేశం జరిపారు. పేరూ, ఊరూ లేని నాగరాజు హత్య విషయం పోలీసు రిపోర్టిస్తే అందరి బతుకులూ కోర్టుకెక్కుతాయి. అందుకని 'చిత్తుగా తాగేసి చచ్చిపోయిన' నాగరాజు శవాన్ని నిశ్శబ్దంగా దహనం చేసేశారు. చూసే కళ్ళనీ, కదిలే పెదిమలనీ డబ్బుతో కట్టేశారు.

మర్నాడుదయం గాలి బాగా వీస్తోంది. ఎక్కడి నుండో పొగ చుట్టలుచుట్టలుగా వచ్చి మేడల్లో దూరి అందరిని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. తాటాకుల పొగ ఊపిరితిత్తులలో దూరి శ్వాస నొక్కేస్తోంది. అందరూ డాబాల మీదకొచ్చి భయంగా చూశారు.

ఇదివరకు పాక వున్నచోట, మళ్ళీ నాలుగు రాటలు పాతి వెదుళ్ళు బిగిస్తున్నాడు ఆ యువకుడు. అతని భార్య యిటుకల పొయ్యి మీద రాత్రి మంచుకి తడిసిన తాటాకులు మంట పెట్టి వంట వండుతోంది. అతని వంటిమీది చెమట బిందువులు నీరెండలో బాకుకొనల్లా మెరుస్తున్నాయి. అతడు చెమట విదుల్చుకుని వెదుళ్ళ మీద తాటాకులు పరిచాడు. గాలిలో ఎగిరిన చెమట బిందువులు బాణాల్లా దూసుకొచ్చి మేడల్లో వాళ్ళ గుండెల్లో గుచ్చుకున్నట్టయింది. మేడలు భయంగా తలుపులేసుకుని ముడుచుకుపోయాయి. నల్లని పొగ మేఘంగా వీధంతా కమ్ముకుంది. మళ్ళీ పాక లేచింది. యీ పొగ ఆగదు!